PARIS 2024

6 రోజుల్లో

షట్లర్లు మెరిసేనా?

హ్యాట్రిక్ పతకంపై కన్నేసిన సింధు

సాత్విక్-చిరాగ్ జోడీపై భారీ అంచనాలు

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

దేశంలో గత కొన్నేండ్లుగా క్రికెట్‌కు సమాంతరంగా క్రేజ్ సంపాదిస్తున్న బ్యాడ్మింటన్‌లో గడిచిన మూడు ఒలింపిక్స్‌లోనూ మనకు పతకం దక్కింది. 2012లో సైనా నెహ్వాల్ ఈ క్రీడలో తొలి పతకాన్ని అందిస్తే పీవీ సింధు.. 2016, 2020లో వరుసగా రజతం, కాంస్యం సాధించడంతో 'పారిస్' లోనూ మన షట్లర్లపై భారీ అంచనాలే ఉన్నాయి. తెలుగమ్మాయి పీవీ సింధు 'ఒలింపిక్ హ్యాట్రిక్ మెడల్'పై కన్నేయగా గత రెండేండ్లుగా అంచనాలకు మించి రాణిస్తున్న పురుషుల డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌తో పాటు మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో పతక ఆశలు రేపుతున్న నేపథ్యంలో ఏడుగురు షట్లర్ల బృందంతో కూడిన భారత ఆటగాళ్లు పతకం గెలిచే ఆనవాయితీని కొనసాగిస్తారా?

పతకం రంగు మారాలని..

2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యోలో కాంస్యం గెలిచిన సింధు ఈసారి పతకం రంగు మార్చాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. వాస్తవానికి 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ తర్వాత ఒక్క మేజర్ టైటిల్ కూడా నెగ్గని సింధు ఫామ్ ఆందోళన కరంగానే ఉంది. గతేడాది ఆమె గాయంతో సతమతమైంది. ఇటీవల పలు బీడబ్ల్యూఎఫ్ టోర్నీలలో ఆడినా ఆశాజనక ప్రదర్శనలు చేయలేకపోయింది. ఒలింపిక్స్‌లో గ్రూప్-ఎమ్ లో సులువైన డ్రా దక్కడం ఆమెకు కలిసొచ్చేదే. తనకంటే తక్కువ ర్యాంకు ఉన్న క్రిటిన్ కూబా (ఈస్టోనియా), ఫాతిమా (మాల్దీవులు)తో ఆడబోయే సింధుకు లీగ్ దశను దాటడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ ప్రిక్వార్టర్స్, క్వార్టర్స్‌లో ఆమెకు చైనా షట్లర్లు బింగ్ జియావో, చెన్ యు ఫే నుంచి కఠిన సవాల్ ఎదురుకానుంది. అయితే వరల్డ్ చాంపియన్‌షిప్స్, ఒలింపిక్స్ వంటి భారీ ఈవెంట్లలో సింధుకు చైనా షట్లర్లపై మెరుగైన రికార్డు ఉంది. క్వార్టర్స్ గండాన్ని దాటితే ఆమె దేశానికి మరో పతకాన్ని ఖాయం చేసినట్టే!

పతకమే లక్ష్యంగా..

బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు రెండు పతకాలు అందించినా ఈ టోర్నీలో భారత్ నుంచి ఫేవరేట్లుగా ఉన్నది మాత్రం సాత్విక్-చిరాగ్ జోడీనే. టోక్యో ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేసిన ఈ ద్వయం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా ఆ తర్వాత మూడేండ్లలో కోచ్ మాథియస్ బోయె శిక్షణలో రాటుదేలింది. ప్రతిష్టాత్మకమైన థామస్ కప్ విజయంలో వీరి కృషి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. ఆ తర్వాత కామన్వెల్త్, ఆసియా క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్‌లలో స్వర్ణాలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన ఈ జోడీ ఈ ఏడాది వరల్డ్ నంబర్‌వన్ ర్యాంకునూ సొంతం చేసుకుంది. విశ్వక్రీడల్లో మూడో సీడ్‌గా బరిలోకి దిగుతున్న ఈ ద్వయం.. గ్రూప్-సీలో లుకాస్ కొర్వి, రొనన్ లబర్ (ఫ్రాన్స్), అల్ఫియన్, అర్డియాంటో(ఇండోనేషియా), లమ్స్ఫుస్, సీడెల్ (జర్మనీ)తో తలపడనుంది. ప్రస్తుతమున్న ఫామ్ దృష్ట్యా ఈ జోడీ క్వార్టర్స్ చేరడం సులువే అయినప్పటికీ ఆ తర్వాత ఎదురయ్యే ప్రత్యర్థులతో ఎలా ఆడతారనే దానిపై వారి పతక అవకాశాలు ఆధారపడ్డాయి.

రెండు దశాబ్దాలలో తొలిసారి..

పురుషుల సింగిల్స్‌లో భారత్ ఈసారి ప్రణయ్, లక్ష్యసేన్‌తో బరిలోకి దిగుతోంది. 2004లో ఏథెన్స్ ఒలింపిక్స్ (నిఖిల్ కనిత్కర్, అభిన్‌శ్యామ్ గుప్తా) తర్వాత మెన్స్ సింగిల్స్‌లో ఇద్దరు షట్లర్లు పోటీపడనుండటం ఇదే ప్రథమం. విశ్వ క్రీడల్లో 13వ సీడ్‌గా బరిలోకి దిగనున్న ప్రణయ్‌కు గ్రూప్-కేలో సులువైన ప్రత్యర్థులున్నారు. లీగ్ దశలో తనకంటే తక్కువ ర్యాంకు ఉన్న లి డక్ ఫట్ (వియత్నాం), ఫాబియన్ రోత్ (జర్మనీ)తో పోటీపడనుండటంతో అతడు కాస్త శ్రమిస్తే ప్రిక్వార్టర్స్‌కు చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక గ్రూప్-ఎల్‌లో ఉన్న లక్ష్య సేన్‌కు మాత్రం ప్రపంచ 19వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ, గత ఒలింపిక్ సెమీఫైనలిస్టు కెవిన్ కార్డన్, జులియన్ కరెగితో తలపడాల్సి ఉంది. అన్ని సజావుగా సాగి ప్రణయ్, సేన్ లీగ్ దశ దాటినా దురదృష్టవశాత్తూ ఈ ఇద్దరే ప్రి క్వార్టర్స్‌లో ఢీకొననున్నారు.

మహిళల డబుల్స్‌లో..

గ్రూప్-సిలో ఉన్న అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టోకు తమకంటే మెరుగైన ర్యాంకు కలిగిన చిహారు, మత్సుయమ (జపాన్), కిమ్ సా యోంగ్, కాంగ్ హీ యోంగ్ (కొరియా), మపస,అంగెలె యు (ఆస్ట్రేలియా) వంటి కఠిన ప్రత్యర్థులున్నారు. అయితే గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ జోడీ పారిస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది.

ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన

2012	సైనా నెహ్వాల్	కాంస్యం
2016	పీవీ సింధు	రజతం
2020	పీవీ సింధు	కాంస్యం

భారత బృందం

సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో

ఆగస్టులో యూటీటీ టోర్నీ

- బరిలో ఎనిమిది జట్లు

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ) లీగ్‌కు వేళయైంది. చెన్నై..జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు యూటీటీ టోర్నీ జరుగనుంది. మొత్తం ఎనిమిది జట్లు 23 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ తమ తొలి మ్యాచ్‌లో జైపూర్ ప్యాట్రియాట్స్‌ను ఎదుర్కొనుంది. లీగ్‌లో స్టార్ ప్యాడర్లు శరత్‌కమల్, మనికా బత్రా, ఆకుల శ్రీజతో పాటు బెర్నాండెటె, నినా మిత్లెహామ్, ఖాద్రి అరున లాంటి విదేశీ స్టార్లు పోటీపడబోతున్నారు. ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో పోరులో ఐదు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో పురుషుల, మహిళల సింగిల్స్ రెండేసి మ్యాచ్‌లు, ఒక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

ఒలింపిక్స్ కోసం వేలు కట్ చేసుకుని..

సిడ్నీ: త్వరలో మొదలుకాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఆడేందుకు ఆస్ట్రేలియా హాకీ జట్టు ఆటగాడు మాట్ డాసన్ ఏకంగా తన వేలును తొలిగించుకున్నాడు. కొద్ది రోజుల క్రితమే డాసన్ ఉంగరపు వేలుకు గాయమైంది. అయితే గాయం నుంచి కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని, ఒలింపిక్స్‌లో ఆడాలంటే వేలు పూర్తిగా కట్ చేసుకోవడమే ఉత్తమమని వైద్యులు సలహా ఇచ్చారు. దీంతో డాసన్ మరో ఆలోచన లేకుండా తన వేలును తొలిగించుకున్నాడు.

కాంగ్రెస్ రాకతో రేసు రద్దు

- గతేడాది హైదరాబాద్‌లో ఘనంగా ఫార్ములా-ఈ
- ప్రభుత్వం మారడంతో ప్రతిష్టాత్మక రేసుకు మంగళం
- 2026లో భారత్‌లో రేసింగ్‌కు నిర్వాహకుల ప్రయత్నం

లండన్: ప్రతిష్టాత్మక ఫార్ములా-ఈ రేసు మళ్లీ భారత్‌కు రాబోతున్నది. గతేడాది కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా అట్టహాసంగా నిర్వహించింది. దేశంలో తొలిసారిగా ఆతిథ్యమిస్తూ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. స్వల్ప వ్యవధిలోనే దేశంలోని మిగతా నగరాలను వెనకకు నెడుతూ అదిరిపోయే రీతిలో హైదరాబాద్‌లో రేసింగ్ నిర్వహించింది. అన్నీతానై వ్యవహరించిన అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఫార్ములా-ఈ రేసింగ్ హైదరాబాద్‌కు తీసుకురావడంలో కీలక భూమిక పోషించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రాకతో ప్రతిష్టాత్మక రేసు ఊహించని రీతిలో రద్దయ్యింది. ఒప్పందానికి ఫుల్‌స్టాప్ పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహణకు బ్రేక్‌లు పడ్డాయి. అయితే భారత్‌లో రేసింగ్ మార్కెట్‌కు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని తిరిగి రేసింగ్‌ను తీసుకొచ్చేందుకు నిర్వహకులు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ప్రముఖ నగరాల్లో రేసు నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నట్లు, అన్నీ కుదిరితే భారత్‌లో 2026 ఫార్ములా-ఈ రేసు జరుగుతుందని కోఫౌండర్ అల్బర్టో లాంగో శుక్రవారం పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 'తెలంగాణలో ప్రభుత్వం మారిన కారణంగా దురదృష్టవశాత్తు రేసు నిర్వహించలేకపోయాం. అంతకు ముందు ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం అర్థాంతరంగా ముగిసింది. గతేడాది హైదరాబాద్‌లో రేసు అద్భుతంగా జరిగింది. వాతావరణానికి అనుకూలంగా ఉండేలా, వ్యర్థాలను వినియోగిస్తూ రేసింగ్ నిర్వహించాం. భారత్ మాకు చాలా పెద్ద మార్కెట్. వచ్చే ఏడాది కాకపోయినా..కచ్చితంగా 2026లో ఇక్కడ రేసింగ్ నిర్వహిస్తాం. ఇప్పటికే కొన్ని నగరాలను పరిశీలించాం. త్వరలోనే వివరాలు వెల్లడిస్తాం' అని అన్నారు. 2023లో అప్పటి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దేశం దృష్టిని ఆకర్షిస్తూ రేసింగ్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే..

విండీస్ దీటుగా..

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన విండీస్.. 83 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 346 పరుగులు చేసింది. కావెమ్ హాడ్జ్ (120) సెంచరీతో కదంతొక్కగా అలిక్ అథనేజ్ (82), బ్రాత్‌వైట్ (48) రాణించారు. డ సిల్వ (28నాటౌట్), హోల్డర్(22 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ స్పీడ్‌స్టర్ మార్క్‌వుడ్ 150కి.మీ వేగంతో నిలకడగా బౌలింగ్ చేయడం మ్యాచ్‌కు హైలెట్‌గా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 416 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

సెయిలర్ల జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న 15వ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు గోవర్ధన్, దీక్షిత సత్తాచాటారు. శుక్రవారం జరిగిన అండర్-16 ఆప్టిమిస్టిక్ ఫ్లీట్ విభాగంలో గోవర్ధన్ తొమ్మిది పాయింట్లతో మరో రేసు మిగిలుండగానే స్వర్ణం ఖాయం చేసుకున్నాడు. శనివారం జరిగే రేసులోనూ గెలిస్తే..బాబు స్మారక ట్రోఫీ కూడా ఖాతాలో వేసుకోనున్నాడు. దీక్షితకు రజతం ఖాయం కాగా, రాష్ట్రానికే చెందిన రిజ్వాన్ నాలుగో స్థానానికి చేరుకున్నాడు.

పాకిస్థాన్‌పై అలవోకగా..

ఆసియా కప్‌లో భారత్ బోణీ

రాణించిన దీప్తి, మంధాన

దంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియా కప్‌లో భారత్ ఘనంగా బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. శుక్రవారం దంబుల్లా వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో దాయాదిని చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 19.2 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. దీప్తి శర్మ (3/20), రేణుకా సింగ్ (2/14), శ్రేయాంక పాటిల్ (2/14) సమిష్టిగా రాణించడంతో పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. ఆ జట్టులోసిద్రా అమీన్ (25) టాప్ స్కోరర్. అనంతరం స్వల్ప ఛేదనను భారత్ 14.1 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తి చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (31 బంతుల్లో 45, 9 ఫోర్లు), షఫాలీ వర్మ (29 బంతుల్లో 40, 6 ఫోర్లు, 1 సిక్సర్) ధాటిగా ఆడి తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశారు. దీప్తికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఆసియా కప్‌లో భాగంగా పాకిస్థాన్‌పై 7 టీ20లలో భారత్‌కు ఇది ఆరో విజయం కావడం గమనార్హం.